క్లుప్తంగా

వలంటీర్లకు నియామక ఉత్తర్వులు అందజేత



వలంటీర్లకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాల**యంలో** కొత్తగా నియమితులైన పది మంది **వలంటీ**ర్లకు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి నియామకపత్రాలు అందజేశారు. సీఎం జగన్ ఆశయసాధనకు కృషి చేసి, గ్రామానికి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఎంపీడీఓ కె.అప్పారావు మాట్లాడుతూ వలంటీర్లు తమ గ్రామకార్యదర్శి, సర్పంచ్‌లు ఏర్పాటుచేసే సమావేశాల్లో తప్పనిసరిగా పాల్గొనాలని, నిర్దేశించిన పనులు సకాలంలో పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో వలంటీర్లు చేయాల్సిన విధి,విధానాలపై ఆయన అవగాహన కల్పించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, మద్దూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కొలువులకు విశ్వవ్యాప్త డిమాండ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న క్రీఫీ సీఈఓ కృష్ణారెడ్డి

బాలాజీచెరువు: ప్రపంచ దేశాల్లో సాఫ్ట్‌వేర్ కొలువులకు మంచి డిమాండ్ ఉందని క్రీఫీ టెక్నాలజీ సీఈఓ కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదిత్య మహిళ కళాశాలలో గురువారం కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో టెక్నోఫిల్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టభద్రులై పట్టాలు పొందుతున్నా కమ్యూనికేషన్ స్కిల్ లేక ఉపాధి పొందలేకపోతున్నారని, కొత్త విషయాలు ఎప్పటికప్పుడు నేర్చుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఏం జరుగుతుందనే భయం విడిచిపెట్టి ధైర్యంగా ముందుకువెళ్లాలన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, ప్రిన్సిపాల్ కర్రి కరుణ, వైస్ ప్రిన్సిపాల్ నాగశ్రీకాంత్, బీసీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల పర్యటన

కరప: మండలం కొరిపల్లిలో గురువారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పర్యటించి భవిష్యత్‌కు గ్యారంటీ, వస్తున్నా మీగ్రామానికి మీ అనంతలక్ష్మి కార్యక్రమాలను నిర్వహించారు. ఆమె వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త బాబూ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా పండూరులో గురువారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నివాళులర్పించారు. ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గ్రామ ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి శ్రీను, సొసైటీ అధ్యక్షుడు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

22న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 22న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పెద్దాపురం నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి గురువారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వారి అడ్మిట్ కార్డులను నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్‌లో సీబీఎస్‌సీఐటీఎంఎస్.ఎన్ఐసీ.ఇన్/2033/జెఎన్‌వీఎక్స్ఐ/అడ్మిట్ కార్డు అని నమోదు చేసి అడ్మిట్‌కార్డు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 22న ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో పరీక్షకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

దోషరహిత ఓటర్ల జాబితా

సామర్లకోట: తప్పులు లేని ఓటరు జాబితా తయారు కావడానికి బీఎల్‌ఓలు కృషి చేయాలని ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. గురువారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్‌ఓల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. వివాహమై అత్తవారింటికి వెళ్లిన వారిని గుర్తించాలని, అలాగే చనిపోయినవారి వివరాలను యజమానితో మాట్లాడి ఫారంపై సంతకం తీసుకోవాలని అన్నారు. ఒక వార్డు నుంచి మరో వార్డుకు బదిలీ అయిన వారిని కూడా గుర్తించాలని ఆయన సూచించారు. 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి నూతన ఓటరుగా చేర్చాలని వివరించారు.

పట్టాల పండగకి పక్కా భవనం



నిర్మాణంలో ఉన్న స్నాతకోత్సవ భవనం

- చురుగ్గా స్నాతకోత్సవ భవన నిర్మాణం
- రూ.19.3 కోట్లతో అధునిక హంగులు
- డిసెంబర్‌లో ప్రారంభోత్సవానికి సన్నాహాలు

బాలాజీచెరువు: యూనివర్సిటీ అనగానే డిగ్రీ పూర్తయ్యాక పట్టాల ప్రదానం, లాంగ్ గౌన్లు, స్వర్ణ పతకాలు, వేదికపై ఉత్తీర్ణులు.. వేదిక దిగువన సహాధ్యాయులు, అధ్యాపకులు, వారి మధ్య ఉత్తీర్ణుల తల్లిదండ్రులు.. అబ్బో.. ఇవన్నీ జీవితంలో మరచిపోలేని మధుర ఘట్టాలు. కులపతి లేదా ఉప కులపతి చేతుల మీదుగా పట్టా అందుకోవడం మెడలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు వేయించుకోవడం ప్రతి విద్యావంతుని చిరకాల వాంఛ. ఇందుకు అద్భుతమైన వేదిక, దానిపై ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు కొలువుదీరడానికి అవసరమైన స్నాతకోత్సవ భవనం ఎంతో అవసరం. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీకి ఆ భవనం లేకపోవడం నిజంగా శోచనీయం. ఇదిగో ఆ భాగ్యం త్వరలో వర్సిటీకి చేకూరనుంది.

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూకే నిర్మితమై పదేళ్లు పైబడుతున్న పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. మూడేళ్ల కాల పరిమితితో నలుగురు వీసీలు పనిచేసినా వర్సిటీకి ప్రధానంగా ఉండవలసిన స్నాతకోత్సవ భవనానికి శంకుస్థాపన చేశారే తప్ప దాని నిర్మాణానికి శ్రద్ధ చూపలేదు. ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఎనిమిది జిల్లాల్లో ఉన్న ఇంజినీరింగ్, ఫార్మశీ, మేనేజ్‌మెంట్ కళాశాలలకు వేదికగా ఉన్న వర్సిటీ ఇప్పటి వరకూ 9 స్నాతకోత్సవాలు నిర్వహించగా కులపతి హోదాలో రెండు సార్లు రాష్ట్ర గవర్నర్లు హాజరయ్యారు.

ఇంతటి ఉన్నతమైన వేడుకలకు తాత్కాలిక **వేదికలే గతి అవుతున్నాయి. ఈ** సందర్భాల్లో **షామియానాలు, ఏసీలు, వేదిక** నిర్మాణానికి సుమారు రూ.10 లక్షలు వ్యయం అవుతోంది.

ఇటువంటి వృథా ఖర్చులు నియంత్రించడంతో పాటు వర్సిటీకి గౌరవప్రదంగా నిలచే స్నాతకోత్సవ భవనం దాదాపు 1500 మంది కుర్చునేలా పరీక్షల విభాగ భవనం పక్కన నూతన స్నాత్సకోత్సవ భవనాన్ని నిర్మిస్తున్నారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తొలి సమావేశంలోనే దీనిపై దృష్టి సారించి టెండర్ల ప్రక్రియ పూర్తిచేయడంతో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.

నా హయాంలోనే పూర్తిచేయాలని కోరిక



వర్సిటీకు ప్రధానంగా ఉండవలసిన స్నాతకోత్సవ భవన నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని డిసెంబర్ నాటికి పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రెండు నెలల వ్యవధిలో దాదాపు పునాది స్థాయి వరకు పూర్తి చేసారు. అత్యాధునిక హంగులతో నిర్మాణం చేపడుతున్నాము. రూ.19.3 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించాం. నా హయంలో శంకుస్థాపన చేసిన నేపథ్యంలో పూర్తిచేసి ప్రారంభించాలనే ఆశయంతో పనిచేస్తున్నాం.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, వీసీ, జేఎన్‌టీయూకే

ఉడిపి స్వామీజీలకు ఘన స్వాగతం



రాఘవేంద్రస్వామి మఠాన్ని సందర్శించిన ఉడిపి స్వామీజీలు

బోట్‌క్లబ్: ఉడిపి పుత్తిగె మఠ స్వామీజీలు సుగుణేంద్రతీర్థ, సుశీంద్రతీర్థలకు గురువారం రాత్రి కాకినాడలో ఘన స్వాగతం లభించింది. స్థానిక రాఘవేంద్ర స్వామి మఠ ప్రాంగణంలో మఠ కమిటీ అధ్యక్షుడు కె.భగీరథ శర్మ, ప్రతినిధులు ఆయనకు పాదపూజ చేసి స్వాగతం పలికారు. గురువుల అనుగ్రహం ప్రతి ఒక్కరికీ తప్పనిసరని స్వాములు అన్నారు. మఠ ప్రతినిధి వెంకటేష్ మాట్లాడుతూ శుక్రవారం ఉదయం సుదర్శనహోమం, స్వామిజీచే ముద్రా ధారణ, పీఠపూజ, సామూహిక పాదపూజ, అనంతరం కోటి గీతలేఖన యజ్ఞ కార్యక్రమం స్వామీజీ ప్రసంగం ఉంటాయన్నారు. ప్రధాన అర్చకులు రవీంద్ర భట్, కాకినాడ మధ్వ యువజన కమిటీ అధ్యక్షుడు యాతగిరి మధ్వేష్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి



పండూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



పెనుగుదురులో సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: గత ప్రభుత్వాలలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా మీకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందజేస్తున్నామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తెలిపారు. మండలంలోని పండూరులో సచివాలయం-1 వద్ద గురువారం గ్రామస్తులకు 626 సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. ప్రతి కుటుంబంలో వ్యక్తులు ఆధార్ సేవలు, కుల, ఆదాయ, నివాస, తదితర ధ్రువీకరణ పత్రాలు, ముఖ్యంగా రేషన్ కార్డులకు సంబంధించి సేవలు అవసరమని, వాటన్నింటినీ రూపాయి ఖర్చు లేకుండా ఈ కార్యక్రమం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అందజేస్తున్నామన్నారు. ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కె.స్వప్న, పండూరు ఎంపీటీసీ నందిపాటి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు సత్తిబాబు, ధర్మరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు టి.సత్యనారాయణ, గోపుశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఇంద్రపాలెం-2లో జరిగిన కార్యక్రమంలో దరఖాస్తులకు గాను 242 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ మురార్జీ తదితరులు పాల్గొన్నారు.

కరపలో..

కరప: మండలంలోని పెనుగుదురు సచివాలయం-1లో గురువారం ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష శిబిరాన్ని సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డిపల్లి రమేష్ ప్రారంభించారు. అధికారులతో కలసి 800 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు బండారు సుజాత, వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కె.అప్పారావు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏడీఏ కె.బాబూరావు, విద్యుత్‌శాఖ ఏఈ సానా ఈశ్వరప్రసాద్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ ఎ.వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే 'జగనన్న సురక్ష'

- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: దళారీ వ్యవస్థ లేకుండా ప్రజలకు దగ్గరగా సేవలందించాలనే లక్ష్యంతోనే సీఎం జగన్ జగనన్న సురక్ష ప్రారంభించారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. గురువారం సీతారామనగర్, యాళ్లవారిగరువు, పరదేశమ్మపేట, నేతాజీ పార్కు, వార్ఫురోడ్, మిలటరీ రోడ్ ప్రాంతాల్లో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలకు మంజూరైన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకప్పుడు సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సివచ్చేదన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దగ్గరగా సచివాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు అక్కడే అవసరమైన సర్టిఫికెట్లను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పొందే వెసులుబాటును సీఎం కల్పించారన్నారు. అర్హత కలిగి, ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే వారిని గుర్తించి పథకాలు వర్తింపచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మార్కెట్‌కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదమే జగన్ బలం



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

- గడప గడపలో ద్వారంపూడి

కాకినాడ: ప్రజల ఆశీర్వాదమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం 21వ డివిజన్ ఎంఎం ఫంక్షన్‌హాలు ప్రాంతంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. అధికారులు, నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి ఒక్క వాగ్దానాన్ని అమలు చేసి సీఎం జగన్ ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి మళ్లీ అధికారంలో కొనసాగాలని అన్నివర్గాల ప్రజలు కోరుకుంటున్నారని చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మీరంతా మళ్లీ ఆశీర్వదిస్తే మరింత మెరుగైన పాలన అందుతుందని మరోసారి జగన్‌ను సీఎంగా చేసుకుందామని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ బొర్రా రమణ, పలువురు నాయకులు, కార్యకర్తలు వీరి వెంట ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.21లక్షల చెక్కులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం పంపిణీ చేశారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నియోజవర్గంలో 8 మంది లబ్ధిదారులకు చెక్కులను ఆయన అందించారు. నియోజవర్గం పరిధిలో వివిధ ప్రమాదాలలో చనిపోయిన వారి కుటుంబాలకు, అంగవైకల్యం పొందిన వారిని ఆదుకునేందుకు సీఎం జగన్ మంచి మనసుతో ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. పుట్టెడు బాధతో ఉన్న కుటుంబాలకు ఈ సాయం ఆర్థిక దన్నుగా ఉంటాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, కరప జెడీటీసీ యాళ్ల సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

శాకంబరిగా బాలకనకదుర్గమ్మ



కాకినాడ: రూరల్ మండలం రమణయ్యపేట గ్రామ పరిధిలోని శేషాద్రినగర్‌లో బాల కనకదుర్గ అమ్మవారు శాకంబరిగా భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఆలయకమిటీ అధ్యక్షుడు లింగం రవి ఆధ్వర్యంలో సభ్యులు, పెద్ద ఎత్తున మహిళలు కాయకూరలతో అమ్మవారిని అలంకరించారు.

బధిర విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ సాంబమూర్తినగర్‌లోని బధిరుల ఉన్నత పాఠశాలలో 1వ తరగతి నుంచి పదో తరగతి వరకూ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్ఎం డేవిడ్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత విద్యతో పాటు హాస్టల్ సదుపాయం కలదని, బాల బాలికలకు ప్రత్యేక వసతి ఉందన్నారు. ఇతర వివరాలకు 79898 44134 నెంబరుకు సంప్రదించవచ్చన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

బోట్‌క్లబ్: శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ నగర అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ అన్నారు. ముఖర్జీ జయంతిని గురువారం బీజేపీ సౌత్ మండల అధ్యక్షులు చెక్కా రమేష్ ఆధ్యక్షతన నిర్వహించారు. పార్టీ నాయకులు మాలకొండయ్య, గూటూరు పద్మ, భానోజీ, కర్రి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

అల్లూరి కళా సేవలు ఆదర్శనీయం

- నాటక పరిషత్ గౌరవ అధ్యక్షుడు భామిరెడ్డి
- ఉభయ తెలుగురాష్ట్రాల నాటిక పోటీలు ప్రారంభం
- ఆకట్టుకొన్న ప్రక్షాళన నాటిక



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న కవి మార్ని జానకిరామ్ చౌదరి తదితరులు

కాకినాడ కల్చరల్: అల్లూరి సీతారామరాజు నాటక పరిషత్ కళా సేవలు ఆదర్శనీయమని సంఘసేవకులు, పరిషత్ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి అన్నారు. స్థానిక సూర్యకళామందిర్‌లో పరిషత్ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. సభకు పరిషత్ అధ్యక్షులు కర్రి అచ్యుతరామారెడ్డి అధ్యక్షత వహించారు. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు అన్నారు. శనివారం జరిగే నాటిక పోటీలను విజయవంతం చేయాలని పంపన కోరారు. ముందుగా సాహితీ పీఠం, సాగరస్రవంతి సంస్థల సంయుక్త నిర్వహణలో 'అన్నదాత' అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు మార్ని జానకిరామ్‌చౌదరి, కారుప్రోలు గౌరినాయుడు, చెరుకువాడ సత్యనారాయణ సమ్మేళనంలో పాల్గొన్నారు. తరువాత ఉషోదయ కళానికేతన్ (కట్రపాడు) సమర్పణలో చెరుకూరి సాంబశివరావు దర్శకత్వంలో ప్రదర్శించిన 'ప్రక్షాళన' నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొంది. సమాజంలో ఆడవాళ్లపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను ఎలా ఎదుర్కొనాలో ప్రదర్శించారు. తదుపరి గానగంధర్వుల స్వరాభిషేకం పేరుతో సినీ సంగీత విభావరి జరిగింది. గాయకులు బాలు, రమణ, మురళీ, సుశీల, చిన్నారి తదితరులు ఆలపించిన సినీ గీతాలు అలరించారు. ఈ కార్యక్రమంలో పంపన మురళి, డాక్టర్ ప్రభోధ్‌కుమార్, డాక్టర్ డి.శిరిష, భాను పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు



యండమూరులో వెంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కరప: మండలం యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర ఆలయంలో గురువారం వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా కలియడంతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానఅర్చకుడు పెద్దింటి సీతారామం పూజాదికాలు చేశారు. అధికసంఖ్యలో వచ్చి, వ్రతాలు చేయించుకుని, స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కరప విష్ణాలయంలోని వేంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, కూరాడ, పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి తదితర గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి జన్మనక్షత్ర పూజలు చేశారు.

రహదారి విస్తరణకు సహకరించండి

- కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్



రహదారి విస్తరణపై సమీక్షిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: స్థానిక జగన్నాథపురం పాత వంతెన నుంచి మున్సిఫ్ జంక్షన్ వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని మాస్టర్‌ప్లాన్ ప్రకారం వెడల్పు చేసేందుకు అక్కడి భవన యజమానులు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఈ అంశంపై గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019లో మాస్టర్‌ప్లాన్ రివిజన్ జరిగిందని, ఆ మేరకు అక్కడి రహదారిని 80 అడుగుల రహదారిగా విస్తరించాల్సి ఉందన్నారు. యానాం–అమలాపురం వైపు వెళ్ళే వాహనాల రద్దీ అధికంగా ఉందని, అయితే రహదారి వెడల్పు లేకపోవడంతో విపరీతమైన రద్దీ ఏర్పాడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. ముఖ్యంగా రానున్న రోజుల్లో చొల్లంగి, పటవల గ్రామాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటైతే మరో 50 వేల మంది జనాభా పెరిగే అవకాశం ఉందని, అందువల్ల మాస్టర్‌ప్లాన్ ప్రకారం విస్తరణ జరగాలన్నారు. విస్తరణలో స్థలం కోల్పోయే భవన యజమానులకు 1:4 నిష్పత్తిలో టీడీఆర్ బాండ్లు ఇస్తామన్నారు. ఈ సమాశంలో అదనపు కమిషనర్ నాగనరసింహారావు, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కాశీ విశ్వనాథ్

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణకు రోటరీ క్లబ్ సభ్యులు మొక్కలు పెంచాలని ఓఎన్‌జీసీ విశ్రాంత జీఎం విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక రోటరీ హాల్‌లో గురువారం రోటరీ క్లబ్ కాకినాడ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ అధ్యక్షుడిగా కాశీ విశ్వనాథ్, సెక్రటరీ బాబితో ఇతర సభ్యులతో రోటరీ ఎలక్టెడ్ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం కుట్టు శిక్షణా కేంద్రానికి కుట్టుమిషన్, పేద విద్యార్థికి స్కాలర్‌షిప్ కింద రూ.20 వేలు సీతాపతిరావు సౌజన్యంతో అందించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తడాల వరప్రసాద్, మాజీ గవర్నర్లు కేవీఎస్ ఆంజనేయమూర్తి, ఎల్.సత్యనారాయణన్, వీరభద్రారెడ్డి, ఎస్‌వీఎస్ రావు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు శాకంబరిగా బాలా త్రిపుర సుందరి దర్శనం



అలంకరణకు కూరగాయలు, ఆకుకూరలు సిద్ధం చేస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలో ఉన్న బాలా త్రిపురసుందరి సమేత భీమేశ్వర ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం శాకంబరి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. భక్తులు, ఆలయ కమిటీ సేకరించిన కూరగాయాలతో గర్భాలయంతోపాటు ఆలయ పరిసరాలను భక్తుల సహకారంతో గురువారం తీర్చిదిద్దుతున్నారు. అధిక సంఖ్యలో భక్తులు కూరగాయలు, పండ్లు, గోంగూర సమర్పించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారథి తెలిపారు.